# మినీ కథ

## పంచ

పాండవులలో ప్రథముడైన ధర్మరాజు, అతని నలుగురు తమ్ముళ్లు తమ స్థానాలని ఆక్రమించి హైద్రాబాద్ టి.వి ప్రోగ్రాం చూస్తున్నారు.

ఇంతలో వాచ్‌మన్ వచ్చి... "ధర్మరాజా! కౌరవుల వద్దనుండి రాయబారివచ్చాడు. తమ దర్శనం కోసం ఎదురుచూస్తున్నాడు. ప్రవేశపెట్టమంటారా?" అని అడిగాడు.

"ప్రవేశం కల్పించండి" అన్నాడు ధర్మరాజు... చుట్టూవున్న ఖరీదైన వి.సి.ఆర్, ఫ్రిడ్జ్, ఫర్నీచరు మొదలయిన వాటివైపు గర్వంగా చూస్తూ...

"హలో... ధర్మరాజా హౌ ఆర్ యూ!" నవ్వుతూ పలకరించాడు రాయబారి.

"ఫైన్... ఏమిటి విషయం" అన్నాడు ధర్మరాజు. అప్పటివరకూ తిప్పిన మీసం మెలి పడి ఛాధకలగటంతో దానిపైనుండి చెయ్యి తీసి వేస్తూ.

"ధర్మరాజా! మా బ్రదర్ మరు కింగ్ దుర్యోధనుడు మీరో సోదరభావంతో కాలక్షేపం చేయమంచి, తదనంతరం జూదంలో ఎక్స్‌పర్ట్ అయిన మీతో సరదాగా సీక్వెన్స్ ఆడవలెనని మిమ్మల్ని సకుటుంబంగా హస్తినాపురికి ఆహ్వానిస్తున్నారు. ఇదిగో ఇన్విటేషన్" అంటూ ఓ పింటెడ్ లెటర్‌ని ధర్మరాజు చేతికందించాడు రాయబారి.

లెటర్ పూర్తిగా చదివి, సంతోషంతో "అలాగే... వస్తామని దుర్యోధన బ్రదర్‌తో చెప్పండి. ఎంత ఎక్కువగా వుంది. మీరు మా ఆతిథ్యాన్ని స్వీకరించి చల్లబడిన తరువాత వెళుదురు గాని."

"వద్దు మహారాజా. ఇప్పుడే ఫంక్షన్‌లాగి వస్తున్నాను మీ అతిథ్యాన్ని మరోసారి స్వీకరిస్తాను" అన్నాడు ధర్మరాజు మంచితనానికి మెలితిరిగిపోతూ...

"మొన్ననే 'స్రవంతి'లో ప్రచురించిన క్రొత్త వంటకాన్ని ద్రౌపది ఎంతో కష్టపడి తయారు చేసింది. మీరు కూడా దానిని స్వీకరించి మమ్మానందింపచేయండి." అంటూ డైనింగ్ టేబుల్ వైపు దారితీసాడు.

'అమ్మో! అసలు ఈ క్రొత్తవంటకాలను పరికాస్టాఫ్‌కి ముందు రుచి చూపించి ఆ తరువాత ప్రచురింపచేయాలి' అని మనసులోనే తిట్టుకున్నాడు జంద్యాల 'శ్రీవారికి ప్రేమలేఖ' చిత్రం కితంరోజు వీడియోలో చూసిన రాయబారి. పైకి మాత్రం ఎటువంటి ఫీలింగ్స్ కనబడనీయలేదు.

"కూర్చోండి" సీటు చూపిస్తూ అన్నాడు ధర్మరాజు.

ద్రౌపది ప్రిస్టేజ్ ప్రెషర్‌కుక్కర్‌తో చేసిన వంటకాలన్నీ తెచ్చి డైనింగ్ టేబుల్‌పై పెట్టింది.

ప్రొద్దుటనుండి కష్టపడి చేసిన వంటకాన్ని రాయబారికి వడ్డించింది. ధర్మరాజుకు వడ్డించబోతే "వద్దు. వద్దు గెస్ట్ ఫస్ట్, మనం నెక్స్ట్" అన్నాడు ద్రౌపది ఇదివరలో తనపైన, తమ్ముళ్లపైనా చేసిన సరిక్రొత్త ప్రయోగాలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ...

"మహారాణీ! ఇంతకీతమరు చేసిన ఈ వంటకం పేరేమిటి?" ముద్ద నోట్లో పెట్టుకుంటూ అడిగాడు రాయబారి.

"కాష్మోరా"... అంది ద్రౌపది.

నోట్లో పెట్టుకున్న ముద్ద అడ్డుపడినట్లనిపించింది. గాలి ఒక్కసారిగా గట్టిగా వీచింది. గోడకున్న నిలువెత్తు ఆంజనేయస్వామి ఫోటో క్రిందపడి పగిలిపోయింది. ఎక్కడో ఆ సమయంలో నక్క వూళవేసింది. రాయబారికి ముచ్చెమటలు పట్టేశాయి. 'అందే ఇది తిన్నవాడుఒక్కసారిగా చావడన్నమాట. ఇరవై ఒక్కరోజులు తీసుకు తీసుకు చస్తాడన్నమాట' మనసులోనే అనుకున్నాడు. మహారాణీ బాధపడుతుందని ఏదో రెండుముద్దలు తిని లేచిపోయాడు. అయినాసరే రాయబారికి ఒకటే దిగులు పట్టుకుంది. ఈ సరిక్రొత్త వంటకపు దివ్యానుభూతులు ఎలావుంటాయోనని దడదడలాడిపోతున్నాడు. లేనినవ్వు తెచ్చిపెట్టుకుంటూ... "వెళ్ళొస్తాను ధర్మరాజా!"నెమ్మదిగా అన్నాడు రాయబారి.

"సీ యు అగైన్" అన్నాడు ధర్మరాజు, దుర్యోధనునిమీద కోపం రాయబారిమీద తీర్చుకున్నందుకు లోలోపలే ఆనందపడుతూ...

రాయబారి కడుపు చేత్తోపట్టుకుని దుర్యో



ధనుడి దగ్గరికి బయలుదేరాడు. కాష్మోరా వంటకం రాయబారి ఉదరంలో విలయతాండవం చేస్తోంది. దారిపొడుగునా ఒక జేస్పీడు బ్రేకర్లు. ఎట్లాగయితేం దుర్యోధనుడి ముందుపడ్డాడు.

"ఏమిటి విషయం. వెళ్ళిన పని ఏమయింది?" ఆత్రంగా అడిగాడు దుర్యోధనుడు.

"తప్పనిసరిగా వస్తామన్నారు సర్. కాని నా దుంపతెగింది. ద్రౌపది చేసిన కాష్మోరా అనేవంటకాన్ని నాకు వడ్డించారు. నా కడుపులో దేవతలు, రాక్షసులు కలిసి యుద్ధం చేసుకుంటున్నట్లుగా వుంది. మీరు దయవుంచి ఒకవారం సెలవిప్పించండి" కడుపు చేత్తోపట్టుకుని మెలితిరిగిపోతూ అర్థించాడు రాయబారి.

"నీ బాధ నాతో చెప్పుకున్నావ్. నా బాధ ఎవరితో చెప్పుకోను. కౌరవ మహారాణి చేసిన 'ములక్కాడల పాయసం' అనే వంటకాన్ని తిని నా తమ్ముళ్ళందరూ అస్వస్థతకి గురయ్యారు. నా బాధ నీకు చెప్పి ప్రయోజనం ఏముంది కాని నువ్వెళ్ళు" అన్నాడు దుర్యోధనుడు.

'ఈ వంటకాలబాధ నా ఒక్కడికే అనుకున్నాను. ప్రతి ఇంట్లోను ఉన్నదన్నమాట' అనుకుంటూ ఇంటిముఖంపట్టాడు రాయబారి.

"వాట్ మైడియర్ సనిల్లా... పాండవులు కమింగా?" అడిగాడు శకుని.

"తప్పనిసరిగా కమింగ్ అంకుల్.. మరి జూదంలో ఎట్లా ఓడిస్తావో?" సందేహంగా అన్నాడు దుర్యోధనుడు.

"చూస్తావుగా అల్లుడూ, నా ప్లేయింగ్ కార్డ్స్ ప్రతిభ. మీ అత్త ఎంతమొత్తుకున్నా అంత ఇదిగా ఎందుకాచేవాడిననుకున్నావ్. ఇటువంటిచోట ఉపయోగపడుతుందనే..." నవ్వుతూచెప్పాడు శకుని తన పేకాట రహస్యం.

* * *

పాండవులు ద్రౌపదీ సమేతంగా హస్తినాపురానికి బయలుదేరారు.

"హలో! ధర్మరాజా వెల్‌కం" లేనినవ్వు తెచ్చిపెట్టుకుంటూ ఆహ్వానించాడు దుర్యోధనుడు. పరస్పరం కౌరవ, పాండవుల మధ్య కుశల ప్రశ్నలు జరిగిన తరువాత జూదానికి ఉపక్రమించారు.

కౌరవుల తరపున శకుని, పాండవుల తరపున ధర్మరాజు జూదానికి సిద్ధపడ్డారు.

ధర్మరాజుకి సీక్వెన్స్ కలిసి రెండుఆటలు గెలవడంతో, కౌరవులు పొగడ్తలమధ్య నీళ్ళలో శనగలా ఉబ్బిపోతున్నాడు.

పొగడ్తలతో రెచ్చిపోయిన ధర్మరాజు తన ఆభరణాలను, రాజ్యాన్ని, చివరికి తమ్ముళ్ళని,

జి. సోమిరెడ్డి

అన్నదమ్ములందరికి ఏకైక లైఫ్ మేటయిన వైఫ్‌నుకూడా పేకాటలో ఓడిపోయాడు. ధర్మరాజు ఖిన్నుడై, దీనవదనుడై స్టేట్‌నే కాక స్టేటస్‌ను కూడా పోగొట్టుకుని "డియర్ బ్రదర్స్ అయామ్ సారీ" అన్నాడు తమ్ములవైపుచూస్తూ...

ధర్మరాజు దీనావస్థ చూసిన దుర్యోధనుడు వికటాట్టహాసంచేసి "తమ్ముడూ! దుశ్శాసనా... మన దాసినయిన ద్రౌపదిని హాలులోనికి ఈడ్చుకురా!" ఆజ్ఞాపించాడు.

ద్రౌపదిని చెయ్యిపట్టుకుని హాలులోనికి లాక్కొచ్చాడు దుశ్శాసనుడు.

"ఓరీ! దుర్యోధనా... నీతొడ బ్రద్దలుకొట్టి, ఆ రక్తంతో ద్రౌపది తల ముడివేస్తాను" అని తొడచరిచి అరిచాడు భీముడు.

"భీమా! ప్రస్తుతానికి నీదగ్గర కొబ్బరిమానెకుకూడా డబ్బులు లేవుకదా? ఇంకెందుకు నీ పౌరుషవాక్కులు డోన్ట్‌టాక్ ఐసే" కోపంగా అన్నాడు దుర్యోధనుడు.

తొడ చరచటంవల్ల బాధ కలగడంతో తొడసవరచేసుకుంటూ తలదించుకు కూర్చున్నాడు భీముడు.

"బ్రదర్ దుశ్శాసనా! ఈ సభికులందరి మధ్య ద్రౌపదిని వివస్త్రను చెయ్యి." చేత్తో మీసం మెలేస్తూ ఆజ్ఞాపించాడు దుర్యోధనుడు.

దుశ్శాసనుడు ద్రౌపది చీర పట్టుకుని లాగటం ప్రారంభించాడు. పాండవులు అవమానభారంతో హెడ్‌కి హేండ్ అడ్డం పెట్టుకున్నారు. అక్కడికి దగ్గరలో ఉన్న క్లాత్ షోరూం ప్రొప్రయిటర్, ద్రౌపదికి అన్నగారు అయిన కృష్ణుణ్ణి ప్రార్థించింది ద్రౌపది. వెంటనే కృష్ణుడు పదికంచి పట్టుచీరలు, ఇరవై విమల్ చీరలు, ముప్పై ఆర్గండీ చీరలను ఏకబిగిన పంపించేసాడు.

చీర లాగి, లాగి... లాగి ప్రొద్దుట హార్లిక్స్ త్రాగకపోవటంవల్ల స్పృహతప్పి పడిపోయాడు దుశ్శాసనుడు. ద్రౌపది కుప్పగాఉన్న చీరలన్నింటిని తీసుకుని మురిసిపోతూ వెళ్ళిపోయింది.

కొంతసేపటికి శ్రీకృష్ణుడు వచ్చి "ఏమిటి సిస్టర్ నీకేమీ అవమానం జరగలేదుకదా?" ద్రౌపది ముఖంలోకిచూస్తూ అడిగాడు.

"అవమానం జరిగితే జరిగింది కాని అన్నయ్యా, నువ్వు పంపిన విమల్ పాలిస్టర్ చీరల్లోని ఎరుపుమీద తెలుపు చుక్కల చీర చాలా బాగుంది" అంది ద్రౌపది.

ఆ మాటలు విన్నవెంటనే కృష్ణుడికి కళ్ళు తిరుగుతున్నట్టనిపించి ప్రక్కనే ఉన్న సోఫాలో కూలబడిపోయాడు.

(ఈ కథ కేవలం హాస్యంకొరకు మాత్రమే. కౌరవ పాండవులను, వారి అభిమానులని క్షమించమని కోరుతూ....)

